రైతులకు అండగా నిలుస్తాం

● రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆదర్శ రైతులను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 22 : రైతులకు పూర్తిగా అండగా నిలుస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పట్టణంలోని యాదాద్రి రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజ్ఞానాన్ని స్టాల్స్ ద్వారా ప్రదర్శిస్తూ గాంధీ ఫొటో గ్యాలరీ, చరక ప్రదర్శన, గ్రామ నిర్మాణ ఇంజినీర్లు, మిల్లెట్స్, పురాతన, ఆధునిక వ్యవసాయ పనిముట్లు, ప్రకృతి వ్యవసాయదారుల పంటలు, ఎద్దు గానుగ, మల్కం గేమ్, యోగా ప్రదర్శనల తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి వీక్షించారు. 150 చెరక ప్రదర్శన, 500 సామూహిక గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. సేంద్రియ, సమీకృత వ్యవసాయం చేస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న సుమారు 115 మంది ఉత్తమ రైతు దంపతులకు పుడమి మిత్ర అవార్డులు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 35 మంది అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, ఎఫ్‌పీఓలకు కిసాన్ సేవారత్న అవార్డులను అందించి సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గాంధీ సూచించిన మార్గంలో తమ ప్రభుత్వం నడుస్తున్నదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యారెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మెరుగు మధు, జిల్లా అధ్యక్షుడు మాటూరి అశోక్, కార్యక్రమం కన్వీనర్ పడమటి పావని, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ చైర్మన్ బాలరాజు, జిల్లా ప్రతినిధులు అచ్చయ్య, దుర్గాప్రసాద్, విశ్రాంత పశు వైద్య శాఖ జేడీ మదన్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి : మంత్రి కోమటిరెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 22 : రాజ్యసభలో బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. అంబేద్కర్ పేరు పలికే బదులు ఏదైనా దేవుడి పేరు పలకండి.. పుణ్యం వస్తుందని బాధ్యతారహితంగా కేంద్ర హోం శాఖ మంత్రి చెప్పడం సరికాదన్నారు.

ఎంపీ చామల మాట్లాడుతూ జమిలి ఎన్నికల బిల్లు కోసమే శీతాకాల పార్లమెంట్ సమావేశాలు జరిగాయన్నారు. అదానీ, మణిపూర్ అంశాలపై చర్చ జరుపాలని కోరితే సభను వాయిదా వేసుకుంటూ వచ్చారని మండిపడ్డారు. రాజ్యాంగం పట్ల బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తుందని విమర్శించారు.

మహనీయుల విగ్రహాలు నెలకొల్పడం అభినందనీయం

● ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి

అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి

రాజాపేట, డిసెంబర్ 22 : మారుమూల పల్లెలో మహనీయుల విగ్రహాలు నెలకొల్పడం అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మండలంలోని కొత్త జాల గ్రామంలో ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విగ్రహాల దాతలు కరాటే బాలు, మాజీ సర్పంచ్ ఠాకూర్ ధర్మేందర్ సింగ్‌ను అభినందించారు. అంతకుముందు గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, నాయకులు బొమ్మక్ రమేశ్, గొల్లపల్లి రాంరెడ్డి, విట్టల్‌నాయక్, బాలరాజుగౌడ్, మోత్కుపల్లి ప్రవీణ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, మహేశ్, నరసింహులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీలో పనులు త్వరగా పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 22 : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన బీఎన్ తిమ్మాపూర్ ప్రజలకు నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో రూ.32లక్షలతో చేపట్టే 2 బోరు మోటార్లు, పైపులైన్ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీవాసులకు త్వరలో అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ పనులను వెంటనే జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ, కౌన్సిలర్ గుండెగల్ల అంజమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉడుత శారద, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.కరుణాకరన్, ఉప కార్య నిర్వాహక ఇంజినీర్ పి.ప్రశాంత్‌కుమార్, భువనగిరి మండల ఇంజినీర్ గుండురావు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు నాంది పాఠశాల

● అవధాన ఉపాసకులు గరికపాటి నరసింహారావు

గరికపాటిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆలేరు టౌన్, డిసెంబర్ 22 : విద్యార్థుల సమగ్ర భవిష్యత్‌కు తల్లిదండ్రులతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు నాంది పలుకాలని ప్రముఖ అవధాన ఉపాసకులు, రచయిత గరికపాటి నరసింహారావు అన్నారు. ఆలేరులోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన శారద మాత జయంతిలో ఆయన మాట్లాడారు. చదువు కోసం విద్యార్థులపైన తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకురావద్దన్నారు. చిన్నతనం నుంచి పిల్లలను హాస్టళ్లలో ఉంచితే కన్నవారి ప్రేమ, ఆప్యాయతలు, బంధుత్వాలకు దూరమై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు సమాజ మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యుడు బండిరాజుల శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు

భూదాన్ పోచంపల్లి : బీబీనగర్ కిడ్స్ కింగ్‌డమ్ గ్రామర్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 27న మండలంలోని పెద్దరావులపల్లిలో, 28న కప్రాయపల్లి, జూలూరు గ్రామాల్లో ఆరోగ్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరెస్పాండెంట్ కొండవీటి మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి సౌభాగ్యం నినాదంతో గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

మున్సిపాలిటీ వద్దు.. గ్రామాలే ముద్దు

● గ్రామపంచాయతీలుగా కొనసాగించాలని కోరుతున్న ప్రజలు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 22 : మున్సిపాలిటీలో విలీనమైతే తమ గ్రామాలు అభివృద్ధి చెందుతాయనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. పన్నులు పెరిగాయి తప్ప.. తమకు అభివృద్ధి, సౌకర్యాలు సమకూరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇక మున్సిపాలిటీ వద్దు.. గ్రామాలే ముద్దు అని, గ్రామపంచాయతీలుగా కొనసాగించాలని కోరుతున్నారు. మండలంలోని ముక్తాపూర్, రేవణపల్లి గ్రామాలను 2018 ఆగస్టు 2న భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఈ గ్రామాల విలీనంతో మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య 13కు చేరింది. ఇందులో ముక్తాపూర్ 1, 2 వార్డులు (రేవణపల్లి పరిధిలో కొంత భాగం), రేవణపల్లి 3వ వార్డు పరిధిలో ఉన్నాయి. ముక్తాపూర్‌లో 1,962 మంది, రేవణపల్లిలో 1,924 మంది జనాభా ఉన్నారు. వీరితో కలిపి మున్సిపాలిటీలో మొత్తం జనాభా 17,074కు చేరింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఓట్లురు 14,138 మంది ఉన్నారు.

పన్ను చెల్లిస్తున్నా సమకూరని సౌకర్యాలు

మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల ప్రజలు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. కానీ.. అనుకున్న రీతిలో సౌకర్యాలు సమకూరడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు కోటి రూపాయలు ఆస్తి పన్ను లక్ష్యంగా ఉండగా.. 45 శాతం వసూలైంది. మున్సిపాలిటీలో విలీనమైనా.. గ్రామపంచాయతీలో ఉన్న వసతులే తప్ప కొత్తగా అభివృద్ధి ఏమీ జరుగలేదని జనం వాపోతున్నారు. మార్కెట్ వ్యాల్యూ పెరుగడంతో పన్నులు పెరిగాయి. పేద, మధ్యతరగతి ప్రజలు ట్యాక్స్‌లు కట్టలేక, కొత్తగా ఇల్లు కట్టుకునేవారు పర్మిషన్ కోసం చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పైగా పేదలు ఉపాధి హామీ పనులు కోల్పోయారు.

భూదాన్ పోచంపల్లి పట్టణం వ్యూ..

మున్సిపాలిటీలో పన్నులే.. పనులు లేవు

మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలకు జాతీయ ఉపాధి హామీ పథకం వర్తించడం లేదు. దీంతో నిరుపేదలకు ఉపాధి లేకుండా పోయింది. పోచంపల్లిలో 1,668 జాబ్ కార్డులు, ముక్తాపూర్‌లో 362, రేవణపల్లిలో 247 జాబ్ కార్డులు ఉండగా.. పోచంపల్లి మున్సిపాలిటీగా మారడంతో ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఉపాధి కోల్పోయారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఇంటి పన్నులు తక్కువ ఉండేది. ఇప్పుడు ఇంటి నిర్మాణం చేయాలంటే పర్మిషన్ కోసం మున్సిపాలిటీలో లక్షకు పైగా ఖర్చు అవుతుంది. గ్రామ పంచాయతీలో పది వేలు మాత్రమే ఉండేది. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు మెంబర్ల పదవులు ఉండేవి. మున్సిపాలిటీలో ఒక్క కౌన్సిలర్ పదవి మాత్రమే ఉంటుంది. గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను వెయ్యి రూపాయల్లోపు వచ్చేది. మున్సిపాలిటీలో చెత్తను తీసుకెళ్లేందుకు బండికి నెలకు వంద రూపాయలు చొప్పున సంవత్సరానికి రూ.1200 చెల్లించాల్సి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు కేటాయిస్తుంది. గ్రామాల్లో రాజకీయంగా పదవులు లభించేవి. మున్సిపాలిటీలో పన్నులు తప్ప అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

గ్రామ పంచాయతీగా మార్చండి

భూదాన్ పోచంపల్లి గ్రామపంచాయతీని మున్సిపాలిటీ చేయడంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. గ్రామీణ పర్యాటక ఉత్తమ గ్రామంగా ప్రసిద్ధి చెందిన పోచంపల్లి.. పల్లె వాతావరణంలోనే అన్ని వర్గాల చేతివృత్తులు, కుటీర పరిశ్రమలతో అభివృద్ధి చెందుతుంది. మున్సిపాలిటీగా మారితే సామాన్యులకు పన్నుల భారం అధికం. ఇంటి పర్మిషన్‌కు వెళ్తే లక్షల రూపాయల భారం అవుతుంది. పంచాయతీగా ఉన్నప్పుడు సంవత్సరానికి ఇంటి ట్యాక్స్ రూ.700 లోపు వచ్చేది. ఇప్పుడు చేత్త సేకరణకు సంవత్సరానికి రూ.1,200 అవుతుంది. పన్నులు పెరుగడంతో పేదలకు భారం అవుతుంది.

– పట్నం కృష్ణకుమార్, లెక్చరర్, భూదాన్ పోచంపల్లి

ఇంటి పన్నులు పెరిగినయ్

ప్రజలకు ఇష్టం లేకుండానే పోచంపల్లి మున్సిపాలిటీలో మా గ్రామాన్ని కలిపారు. గ్రామ పంచాయతీగా ఉంటే సర్పంచ్, వార్డు మెంబర్లు ఉంటారు. ప్రజల సమస్యలు పట్టించుకుంటారు. మున్సిపల్ అయితే కౌన్సిలర్, వార్డు అధికారులు ఉంటారు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి. మున్సిపాలిటీతో ఉపాధి హామీ కూలీలకు పని లేకుండా పోయింది. మున్సిపాలిటీ వచ్చాక ఇంటి పన్నులు పెరిగినయ్. సామాన్య ప్రజలకు పాలన దూరం అవుతుంది. మా గ్రామాల కోసం సమష్టిగా పోరాడుతాం.

– మునుకుంట్ల బాలచంద్రంగౌడ్, ముక్తాపూర్

ప్రజాభిప్రాయమే లేదు

అధికారులు మా గ్రామాలను మున్సిపాలిటీలో బలవంతంగా కలిపారు. ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణ జరుగలేదు. ప్రజలందరూ ఒప్పుకొన్నారని అధికారులు రాసుకున్నారు. మున్సిపాలిటీలో పేదలపై పన్నుల భారం పడుతుంది. మాకు రాజకీయ పదవులు దూరమయ్యాయి. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయిస్తుంది. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటాం.

– మైసగోని వెంకటేశం, రేవణపల్లి గ్రామం

'ప్రభుత్వ విప్ ఐలయ్య బంధుప్రీతి వీడాలి'

మోటకొండూర్, డిసెంబర్ 22 : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పదేండ్లుగా ప్రతిపక్షంలో ఉండి పార్టీ కోసం పనిచేసిన కాంగ్రెస్ కార్యకర్తలను విడిచి బంధుప్రీతితో నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సిరబోయిన మల్లేశ్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుగ్గ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్ అన్నారు. పార్టీ కార్యకర్తలను విస్మరించి నియోజకవర్గంలో స్వార్థ రాజకీయాలకు ఎమ్మెల్యే తెరతీశారని ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం యువజన కాంగ్రెస్ నూతన కమిటీ ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేకున్నా కాంగ్రెస్ వెంటే ఉన్న కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఆయన బంధువులను చెంతన చేర్చుకుని పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, బీర్ల ఫౌండేషన్ సేవలు ప్రజల్లోకి ఎలా వెళ్లాయో గుర్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్, మండలాధ్యక్షుడు బుగ్గ శ్రీనివాస్‌ను సన్మానించారు. నాయకులు అనంతుల నవీన్‌రెడ్డి, మహమ్మద్ మంజూర్, రేగు రమేశ్, ఎలిమినేటి జంగారెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్

మహనీయులపై చిన్నచూపు తగదు

రాజాపేట : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణపై స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు చిన్నచూపు తగదని బోడుప్పల్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొమ్మక్ రమేశ్ అన్నారు. మండలంలోని కొత్త జాల గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఆవిష్కరణ ఉదయం 12 గంటలకు ఉండగా.. ఎమ్మెల్యే సాయంత్రం వరకూ రాక పోవడమేంటన్నారు. బిజీ షెడ్యూల్ ఉంటే ఇలాంటి కార్యక్రమానికి ముందే సమయం ఇవ్వవద్దని హితవు పలికారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి వెంకటస్వామి కృషి

● కలెక్టర్ హనుమంతరావు

కలెక్టరేట్‌లో కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 22 : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి అని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, డీఏఓ గోపాల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసం నిరంతరం కృషి చేసిన వెంకటస్వామి

మోత్కూరు : దివంగత మాజీ ఎంపీ జి.వెంకటస్వామి పేదల కోసం నిరంతరం కృషి చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు బీఆర్ఎస్ నేత చింతల పరామర్శ

యాదగిరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 22 : మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొమ్మరపు సురేశ్ తండ్రి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సురేశ్‌కు సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ర్యాకల శ్రీనివాస్, కుతాడి సురేశ్, వల్లపు విజయ్, జి.శ్రీశైలం, నరేశ్‌గౌడ్ ఉన్నారు.

మల్లయ్య మృతికి మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ సంతాపం

మల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 22 : మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన సుదగాని మల్లయ్య హైదరాబాద్‌లోని నాగోలులో నివాసం ఉంటున్నారు. ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా.. మల్లయ్య మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు.

జాతీయ అవార్డు నాలో బాధ్యత పెంచింది

● బీసీ నేత జూకంటి ప్రవీణ్‌కుమార్

రవీంద్ర భారతిలో అవార్డు అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

రాజాపేట, డిసెంబర్ 22 : హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ సోషల్ సర్వీసెస్ అండ్ లీడర్‌షిప్ జాతీయ అవార్డు-2024ను టీజేఎస్ నేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్ ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పీడిత, తాడిత వర్గాల ఉన్నతి కోసం విశేష సేవలందించినందుకు జాతీయ స్థాయి అవార్డు రావడం సంతోషించదగ్గ పరిణామమన్నారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యత పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ చైర్మన్ రామకృష్ణగౌడ్, ప్రముఖ దీక్షితులు దైవజ్ఞశర్మ, వల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన యువకులకు సన్మానం

గుండ్లగూడెంలో యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆలేరు రూరల్, డిసెంబర్ 22 : ఇటీవల భువనగిరిలో నిర్వహించిన సీఎం కప్ ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో గుండ్లగూడ యువకులు మొదటి బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన రాజేశ్, రాజు, వెంకటేశ్, దినేశ్, వీరేందర్, పవన్‌ను గ్రామస్తులు ఆదివారం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో దూసరి మురళీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ సురేశ్‌రెడ్డి మృతికి ఎమ్మెల్యే కుంభం సంతాపం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 22 : పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఏనుగు సురేశ్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదివారం సురేశ్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ ఉన్నారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో సురేశ్‌రెడ్డి చిత్రపటానికి పట్టణ జర్నలిస్టులు నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 22 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వడాయిగూడెం గ్రామానికి చెందిన బబ్బూరి శంకర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు సిద్ధిరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు ఉపేందర్, మల్లేశ్, ఆంజనేయులు, ఉస్మాన్, భిక్షానాయక్, బాలకృష్ణ, నరేందర్, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

వలిగొండ, డిసెంబర్ 22 : మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన సుక్క నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కుమార్తె అరుణతో కలిసి 2004-05 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న బాల్య స్నేహితులు అండగా నిలిచారు. రూ.28వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం ఆమెకు అందజేశారు. భవిష్యత్‌లో అరుణ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వనగంటి వెంకటేశ్, బందారపు రవి, కొమ్ము వెంకటేశ్, కందుల చక్రపాణి, గాడిపల్లి సురేశ్, పిన్నింటి నరేందర్‌రెడ్డి, జువ్వగాని సురేశ్, లింగస్వామి, చాంద్ పాషా, గులాం హుస్సేన్ పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకోలేనిది : ఎస్సీ చెన్నయ్య

ఎస్సీ చెన్నయ్యను సన్మానిస్తున్న లక్ష్మాపురం గ్రామస్తులు

రామన్నపేట, డిసెంబర్ 22 : పుట్టిన ఊరు కన్న తల్లి లాంటిదని, జన్మభూమి రుణం తీ